క్లుప్తంగా

వెంకన్న ఆలయంలో శ్రావణ పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మొగల్తూరు: మొదటి శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని మొగల్తూరులోని కేతీకీపుర సామ్రాజ్య శ్రీ భూసమేత వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గంగ పవన్ ఆధ్వర్యంలో స్వామివారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి పూజలు, అభిషేకాలు జరిపారు. గ్రామానికి చెందిన భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

లైన్‌మేన్ మృతికి నివాళి



భీమలాపురంలో రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన భీమలాపురం విద్యుత్ శాఖ లైన్‌మేన్ యాళ్ల రాజుకు పంచాయతీ పాలకవర్గం ఘనంగా నివాళులర్పించారు. శనివారం పంచాయతీ ఆవరణలో సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల మాధవరావు, కార్యదర్శి కృష్ణ, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టణ రెండో ఎస్సైగా ముత్యాలరావు



ఎస్సై ముత్యాలరావు

నరసాపురం: నరసాపురం పట్టణ రెండవ ఎస్సైగా సానబోయిన ముత్యాలరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. 2020లో ఎస్సైగా పదోన్నతి పొందిన ముత్యాలరావు ఏఎస్సైగా నరసాపురం, పాలకొల్లు ప్రాంతాల్లో దీర్ఘకాలం పనిచేశారు. ఇంటిలిజెన్స్‌లో కూడా సేవలందించారు. ఎన్నికలకు ముందు తూర్పుగోదావరి జిల్లా బదిలీ కాగా, ఇప్పుడు నరసాపురం రెండో ఎస్సైగా నియమితులయ్యారు.

నిధుల కొరత ఉన్నా అభివృద్ధికి ప్రాధాన్యం



గంగడుపాలెంలో సిమెంట్ రోడ్డు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల

యలమంచిలి: రాష్ట్రంలో నిధుల కొరత ఉన్నా అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. గంగడుపాలెం, మట్లపాలెం, నారినమెరక, వడ్డిలంక గ్రామాలలో రూ.72 లక్షలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మల్లాడి ఉమామహేశ్వరి, చల్లా వెంకట నాగలక్ష్మి, వలవల లక్ష్మి, అడబాల చిట్టిబాబు, ఎంపీటీసీ కడలి సునీత తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు సమస్య పరిష్కరించాలని వినతి

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో గోడౌన్స్ వద్ద ఉన్న రైల్వే గేటు సమస్య పరిష్కరించాలని కోరుతూ వాండ్రం గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పలువురు కేంద్రం మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేగేటును రాత్రి 7 గంటలకు మూసివేసి ఉదయం తెరుస్తున్నారని, ఈ గేటు నుంచి వాండ్రంతో పాటు ఐదారు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని, వీరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం అందించిన వారిలో మాజీ సర్పంచ్ రెడ్డిపల్లి సత్యనారాయణ, యాండంగి యేసు, బీజేపీ నాయకుడు లక్ష్మీనారాయణ తదితరులు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు శనివారం వినతిపత్రాన్ని అందించారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

పారిశుధ్యం పరిశీలన

పెనుగొండ: పారిశుధ్య నిర్వహణకు ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నట్లు పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి తెలిపారు. శనివారం పెనుగొండ దొంగగూడెంలో పారిశుధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించారు. వర్షాకాలం కావడంతో జ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. వర్షపు నీరు నిలువ ఉండడం వలన దోమలు ప్రబలుతాయని, వీటి నివారణకు దోమల మందు పిచికారీ చేయిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల వద్ద నీరు నిలువ ఉండకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకర్‌రావు, భీమడోలు సాయి, తిక్కిరెడ్డి పవన్ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు నిర్మాణంతో తీరిన వెతలు



చినమామిడిపల్లి వద్ద నిర్మించిన బైపాస్ రోడ్డు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌ను ఆనుకుని చినమామిడిపల్లిలో నిర్మించిన బైపాస్ రోడ్డు కీలకంగా మారడమే కాకుండా సుమారు 40 గ్రామాల వారికి ఉపయోగంగా ఉంది. చినమామిడిపల్లిలో రైల్వేగేట్ సమస్య ఏడాదిన్నర క్రితం వరకూ వేధించేది. పలురైళ్ల రద్దీ కారణంగా పగటిపూట కూడా సుమారు 3 గంటలపాటు గేటు మూసేసేవారు. ఇంజిన్‌లు షంటింగ్ కారణంగా ఈ పరిస్థితి ఉండేది. అయితే రైల్వేశాఖ స్టేషన్‌ను ఆనుకుని ఉన్న స్థలంలో బైపాస్‌రోడ్డు నిర్మించి, గేట్‌ను శాశ్వతంగా మూసేశారు. దీంతో రైల్వేగేట్ సమస్యకు మోక్షం కలిగింది. దీంతో మత్స్యపురి మీదుగా నరసాపురం నుంచి భీమవరం వెళ్లే ట్రాఫిక్ ఈ రోడ్డులో విపరీతంగా పెరిగింది. రైల్వేగేట్ సమస్య లేకపోవడంతో సుమారు 40 గ్రామాల వారు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇటుగా ప్రయాణిస్తున్నారు. దశాబ్దాల రైల్వేగేట్ సమస్య తీరడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని కులాలనూ దామాషా ప్రకారం వర్గీకరించాలి



న్యూఢిల్లీలో ధర్నాలో మాట్లాడుతున్న నల్లి రాజేష్

పాలకొల్లు అర్బన్: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఏపీ, తెలంగాణ మాలల ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద శనివారం ధర్నా నిర్వహించినట్లు ఏపీ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ చెప్పారు. వివరాలను స్థానిక విలేకరులకు ఫోన్‌లో వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341, ఆర్టికల్ 14కు భంగం కలిగించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ చేయవలసి వస్తే అన్ని కులాల్లో కూడా విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో కూడా అన్ని కులాలను జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ చేసి అన్ని కులాలకు న్యాయం చేయాలని కోరారు. మాలమహానాడు జాతీయ, రాష్ట్ర నాయకులు గొల్ల అరుణ్‌కుమార్, పిల్లి సుధాకర్, మంత్రి నరసింహయ్య, సిద్ధాబత్తుల కొండబాబు, నల్ల చిన్నారావు, గుండె నగేష్‌బాబు, విప్పర్తి ప్రభాకరరావు, గారపాటి నానాజీ, మాల సంఘాల పెద్దలు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నట్లు రాజేష్ చెప్పారు.

ఉపాధ్యాయుల ఉన్నతికి యూటీఎఫ్ కృషి



మేడపాడులో వేడుకలకు హాజరైన ఉపాధ్యాయులు

యలమంచిలి: మేడపాడులో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను శనివారం సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద నూతనంగా నిర్మించిన జెండా స్థూపం వద్ద సంఘ పతాకాన్ని నాయకులు పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖలే ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ 50 ఏళ్లలో ఉపాధ్యాయుల ఉన్నతికి యూటీఎఫ్ అవిరళ కృషి చేసిందన్నారు. సంఘ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అకాడమిక్ ప్రొఫెషనల్ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరాజు మాట్లాడుతూ ఈ నెల 26న భీమవరంలో జరిగే రాష్ట్ర విద్యా సదస్సును జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతి కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు, రాష్ట్ర మాజీ కార్యదర్శి సరిపల్లి జయప్రభ పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

మొగల్తూరు: యూటీఎఫ్ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని కార్యాలయంలో మాజీ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. పలువురు మాజీ ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 1974 ఆగస్టు 10న సంఘాన్ని స్థాపించారని, అప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఉపాధ్యాయులు అనేక సమస్యలపై పోరాడారన్నారు. ఈ సందర్భంగా పలువురు మాజీ, సీనియర్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సీనియర్ ఉపాధ్యాయులు పొదిల కృష్ణమూర్తి, చింతపల్లి ఆంజనేయులు, అలీవలి, ఉపాధ్యాయులు ఎస్.బుజ్జిబాబు, సీహెచ్ కృష్ణమోహన్, శ్రీనివాస్, ఎ.మురళీధర్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు అల్పాహారం అందజేత

నరసాపురం రూరల్: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శనివారం ఆ సంఘం నాయకులు నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు స్వీట్లు, అల్పాహారం పంపిణీ చేశారు. అనంతరం యూటీఎఫ్ భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో జాతీయ జెండాను సీనియర్ నాయకులు నందికేశవరావు, ఆర్ఆర్‌కే రాజు, యూటీఎఫ్ జెండాను కొండేటి ప్రమీల ఆవిష్కరించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.మార్కండేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అమరులైన ఉద్యమనాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు. విశ్రాంత ఉపాధ్యాయులు నందికేశవరావు, ఆర్ఆర్‌కే రాజులకు చిరుసత్కారం చేశారు. జిల్లా కార్యదర్శి కృష్ణకుమారి, జిల్లా ఆడిట్ మెంబర్లు పి శ్రీనివాస్, గోటేటి స్వామి పాల్గొన్నారు.



మొగల్తూరులో యుటీఎఫ్ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఉపాధ్యాయులు



పారిశుధ్య కార్మికులకు అల్పాహారం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం



ఢిల్లీలో అంబేద్కర్‌కు నివాళులర్పించి మాట్లాడుతున్న పుష్పరాజ్

పెనుగొండ: ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించడంతో పాటు, క్రీమీలేయర్‌ను వర్తింప చేయాలనడం దళితులను చీకట్లోకి నెట్టివేయడమేనని, రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఆరోపించారు. ఛలో ఢిల్లీలో భాగంగా రెండో రోజు శనివారం తెలంగాణ భవన్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పించి నిరసన వ్యక్తం చేసినట్లు వివరించారు. రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీలకు దూరం చేసే కుట్రలకు పాలకవర్గాలు తెరలేపాయని విమర్శించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఏపీ సీఎం చంద్రబాబుకు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి మాలల ఓట్లు పనికి రావా అని ప్రశ్నించారు. మాలల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆధ్వర్యంలో త్వరలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించిన నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. ఢిల్లీలో జరిగిన నిరసనలో వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నే శ్రీదర్‌రావు, జిల్లా అధ్యక్షుడు ఇంటి సుందర్ కుమార్, జిల్లా ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు నేతల సాల్మన్‌రాజు, జిల్లా కార్యదర్శులు చిల్లే రాజ్‌కుమార్, గెడ్డం అబ్రహం, దాసరి చిరంజీవి, కొమ్మతోటి పాలు పాల్గొన్నారు.

దాతల సహకారంతో డిజిటల్ తరగతి గది



చల్లావారిమెరకలో డిజిటల్ తరగది గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయకర్ తదితరులు

మొగల్తూరు: దాతల ఆర్థికసాయంతో డిజిటల్ తరగతి గదిని నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. శనివారం పేరుపాలెం పంచాయతీ చల్లావారిమెరకలో నిర్మించిన డిజిటల్ రూమ్‌ను వారు ప్రారంభించారు. పేరుపాలెం సౌత్ పంచాయతీకి చల్లావారిమెరకకు చెందిన ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి చల్లా బెనర్జీ ప్రస్తుతం హైదరాబాద్‌లోని నార్త్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ ఇండియా అనే సంస్థలో ఉన్నత స్థితిలో ఉన్నారు. దీంతో తాను చదువుకున్న పాఠశాలలో డిజిటల్ రూమ్ ఏర్పాటుపై తాను పనిచేస్తున్న కంపెనీ ప్రతినిధులను సంప్రదించగా రూ.11.61 లక్షలు మంజూరు చేశారు. దీంతో చల్లావారి మెరకలో డిజిటల్ రూమ్ నిర్మాణంతో పాటు కంప్యూటర్, ప్రింటర్, ఇన్వర్టర్, ప్రొజెక్టర్‌లను ఏర్పాటు చేశారు. పాత్తూరి రామరాజు, సున్నా సునీల్ కుమార్, వీర నరేంద్ర, కె ఆనంద్, ఎం సురేష్ యాదవ్, లక్ష్మణ్ కుమార్, మేళం బన్ను పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



వాలమర్రులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి

పాలకొల్లు అర్బన్: బాల్య వివాహాలు చేస్తే శిక్షార్హులవుతారని సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి అన్నారు. పాలకొల్లు మండలం వాలమర్రు అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు శనివారం మిషన్ శక్తి 100 కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. స్త్రీ, పురుషులు సమానమన్నారు. లైంగిక వేధింపులపై కిషోర బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన పెంచుకోవాలని వివరించారు. ఎవరైనా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి యువతులను మభ్యపెడుతుంటే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎస్.భవాని, కె.సత్యవతి, సీహెచ్ సుబ్బలక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు పీఎంపీల సమావేశం

మొగల్తూరు: మండలంలో పీఎంపీల సంఘం ఏర్పడి 25వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆదివారం ముత్యాలపల్లిలో పీఎంపీల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ముత్యాలపల్లిలో రాజాస్ కల్యాణ మండపంలో నిర్వహించే ఈ సమావేశానికి ప్రముఖ డాక్టర్లు ముఖ్య అతిథులుగా రానున్నారని, కావున మండలంలోని పీఎంపీలంతా హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

మహిళ అదృశ్యం

పెనుగొండ: మతిస్థిమితం లేని ఓ మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుబానీ శనివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనుగొండకు చెందిన చింతపల్లి శ్రీదేవి (43) కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. ఎరుపు రంగు నైటీ ధరించి ఉందన్నారు. వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని, భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

స్టేట్ టోల్ ట్యాక్స్ విరమించుకోవాలి



పట్టణంలో నిరసన తెలుపుతున్న నాయకులు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర రహదారులపై టోల్ ట్యాక్స్ ఆలోచనను విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పాలకొల్లు–పామర్రు రోడ్డులో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం టాక్సులతో వాహనదారుల నడ్డి విరుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టోల్ టాక్స్ విధించి వాహనదారులపై మరింత భారం మోపడం తగదని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ప్రదర్శనలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యవర్గ సభ్యులు జె.గోపాలన్, మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసు, పీవీ ప్రతాప్, కవురు పెద్దిరాజు, కర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి శిక్షణా తరగతులు

పెనుగొండ: పారిశుధ్య పనులు, పరిపాలనా విధానంపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ఈ నెల 12, 13, 14 తేదీల్లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నరసింహప్రసాద్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు విధిగా హాజరుకావాలని కోరారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా కట్టాలి



మార్టేరు సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరి వెంకటరెడ్డి

పెనుమంట్ర: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 11, 12, 13 తేదీలలో ప్రతి కార్యకర్త ఇంటిపై జాతీయ జెండా కట్టాలని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆచంట అసెంబ్లీ బీజేపీ ముఖ్యనాయకుల సమావేశం మార్టేరు రోటరీ క్లబ్ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజల్లో జాతీయ భావం కలిగేలా కార్యక్రమాలు చేసి అన్ని మండలాల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు నాగ సుబ్బారావు, బద్రి నారాయణ పాల్గొన్నారు.

పని సర్దుబాటుతో 'మున్సిపాలిటీ'కి అన్యాయం



రామభద్రంను కలిసి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నరసాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిసర్దుబాటు నిబంధనల వల్ల మున్సిపాలిటీల్లో పనిచేసే ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని యూటీఎఫ్ పట్టణ జనరల్ కార్యదర్శి ఎన్వీ చంద్రకుమార్, జిల్లా కౌన్సిలర్ కె జగ్గరాజు అన్నారు. ఈ మేరకు శనివారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామభద్రంను కలిసి వినతిపత్రాన్ని అందజేశామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పనిసర్దుబాటు నియమ నిబంధనల ప్రకారం ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీలలో పనిచేసే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడాన్ని వ్యతిరేకిస్తామన్నారు. అలా జరిగితే మున్సిపల్ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

వెన్నుపూస బాధితుడికి వాకర్స్ క్లబ్ సహాయం



బాధితుడికి మందులు అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్/యలమంచిలి: ప్రమాదంలో గాయపడి వెన్నుపూస సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తికి పాలకొల్లు వాకర్స్ క్లబ్ తరపున చేయూతనిచ్చినట్లు క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు చెప్పారు. యలమంచిలి మండలం ఊటాడ గ్రామానికి చెందిన బి.శ్రీనివాస్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. అక్కడ ప్రమాదానికి గురికావడంతో దాతల సహకారంతో స్వదేశానికి తిరిగివచ్చాడు. ఆ ప్రమాదంలో వెన్నుపూసకు గాయమై అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయాన్ని స్థానికులు కొందరు పాలకొల్లు క్లబ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో క్లబ్ స్పందించి అతనికి అవసరమైన రూ. 15 వేలు విలువ చేసే మందులను శనివరం అందించినట్లు సుధాకరరావు చెప్పారు. క్లబ్ సభ్యులు షేక్ ఫీర్ సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకర్, సోమంచి శ్రీనివాసశాస్త్రి, గ్రామ సర్పంచ్ బుడితి జయరాజు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు ఉచితంగా ఇస్తాం

మంత్రి నిమ్మల రామానాయుడు హామీ

పాలకొల్లు సెంట్రల్: కూటమి ప్రభుత్వంలో టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు ఉచితంగా ఇస్తామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కట్టిన టిడ్కో ఇళ్లను ప్రస్తుతం త్వరగా పూర్తిచేయడమే తమ ప్రాధాన్యత అన్నారు. టిడ్కో గృహాల్లో ఇప్పటివరకు రుణాలు తీసుకోని లబ్ధిదారులను ఇకపై బ్యాంకులకు పంపి లోన్లు ఇప్పించవద్దని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకూ 6144 మంది టిడ్కో గృహాల లబ్ధిదారుల్లో లోన్లు తీసుకోకుండా ఉన్న వారు సుమారు 500 మంది ఉన్నారని, వీరిలో ఎవ్వరూ బ్యాంకు లోన్లకు వెళ్లవద్దని, కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇళ్లు ఇస్తుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ, బీజేపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

లోన్లు తీసుకున్నవారికి భరోసా ఏది?

లోన్లు తీసుకున్న మిగిలిన లబ్ధిదారులను బ్యాంకు రుణాలు చెల్లించవద్దని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రుణాలు రద్దు చేస్తామని నిమ్మల రామానాయుడు ఎన్నికల్లో హామీ ఇవ్వడం తెలిసిందే. అయితే ఆ హామీతో రుణాలు తీసుకుని బ్యాంకులకు చెల్లించకుండా ఉన్న లబ్ధిదారులకు వాటిని రద్దు చేస్తారా లేదా, వారు బ్యాంకు రుణాలు చెల్లించాలా వద్దా అనే విషయాలపై స్పష్టత ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు.

నేడు దొడ్డిపట్లలో వైద్య శిబిరం

యలమంచిలి: యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం దొడ్డిపట్ల హైస్కూల్లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు జక్కంపూడి మదన్‌మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతోపాటు, కిడ్నీ, మూత్ర, చర్మ, దంత, నేత్ర, జనరల్ వ్యాధులకు వైద్యులు యాతం లక్ష్మీ శ్రీరంగ, జక్కంపూడి సుభాషిణి, కుసుమ ప్రశాంతి, కావలి మౌనితోపాటు అమలాపురం కిమ్స్ ఆసుపత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు.

15న జిల్లా స్థాయి పాటల పోటీలు

నరసాపురం రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మదర్ థెరిస్సా దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ పాటల పోటీల్లో ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను 12వ తేదీలోగా 98480 26302 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు. 15వ తేదీ మధ్యాహ్నం 2గంటల నుంచి నరసాపురం వలంధర్ రేవులో ఈ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, రెండు కన్సోలేషన్ బహుమతులు నగదు రూపంలో అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.